క్లుప్తంగా

నేడు స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశం

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వివిధ రాజకీయపార్టీలతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితాలు, పోలింగ్ బూత్‌లపై సమీక్షించనున్నట్లు చెప్పారు. వివిధ రాజకీయ పార్టీల మండల బాధ్యులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

హరీశ్‌రావు తప్పుడు ప్రచారం

చిన్నకోడూరు(సిద్దిపేట): అసెంబ్లీలో ఎమ్మెల్యే హరీశ్‌రావు అనంతగిరి రిజర్వాయర్‌లో భూనిర్వాసితులకు బీఆర్‌ఎస్ పాలనలో ఎకరాకు రూ.11 లక్షలు ఇచ్చామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అక్కి సంతోష్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అనంతగిరి రిజర్వాయర్ నిర్వాసితులకు ఎకరాకు రూ.6 లక్షలు చెల్లించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇప్పుడు రూ.11 లక్షలు చెల్లించామని తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని హరిహర రెసిడెన్సీకాలనీ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆకుల సత్యనారాయణగౌడ్, అధ్యక్షుడిగా జంగం లింగమూర్తి, ప్రధాన కార్యదర్శిగా గణపతి సంతోష్‌కుమార్, ఆర్థిక కార్యదర్శిగా కొమురవెల్లి ఐలయ్య, ఉపాధ్యక్షుడిగా మేంగన బాల్‌రెడ్డి, సుద్దాల భిక్షపతి, సంయుక్త కార్యదర్శిగా బొమ్మ మల్లేశం, ధర్పల్లి కనకయ్య, చొప్పదండి సుధాకర్‌తోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం స్థానిక వార్డు కౌన్సిలర్ వంగ రేణుకా తిరుమల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా స్వామిగౌడ్



దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ ధర్మాజీపేట గౌడసంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా కర్ణంపల్లి స్వామిగౌడ్, ఉపాధ్యక్షుడిగా మెరుపుల యాదగిరిగౌడ్, ప్రధాన కార్యదర్శిగా నాంపల్లిగౌడ్, కార్యదర్శిగా మద్దికుంట సత్తాగౌడ్, కోశాధికారిగా దుబ్బాక మల్లేశంగౌడ్, సలహాదారులుగా వెంకటస్వామిగౌడ్, శివరాజంగౌడ్, దుంపలపల్లి స్వామిగౌడ్, శంకర్‌గౌడ్, నర్సాగౌడ్, నీలం గౌడ్‌లను ఎన్నుకున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు తోడ్పాటు



చెక్కు అందిస్తున్న చైర్మన్ మల్లయ్య తదితరులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని తాడూరులో సీసీ కెమెరాల ఏర్పాటుకు బాలవికాస తరఫున రూ.50 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ ఆలేరు మల్లయ్య తెలిపారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తున్న కమిటీ సభ్యులకు ఆదివారం ఆయన ఆ చెక్కు అందించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయం మూసివేత



ఆలయాన్ని మూసి వేస్తున్న అధికారులు, అర్చకులు

కొమురవెల్లి(సిద్దిపేట): సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని ఆలయ అధికారులు, అర్చకులు ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. ఈ సందర్భంగా ఈఓ టంకసాల వెంకటేశ్ మాట్లాడుతూ చంద్రగ్రహణం ఏర్పడుతుండడంతో ఆలయాన్ని మూసివేశామన్నారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ, శుద్ధి, ప్రాతఃకాల పూజల అనంతరం భక్తులకు స్వామివారి దర్శనాన్ని కల్పిస్తామని చెప్పారు. భక్తులు గమనించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

పరిహారం పొందేదెప్పుడు?

క్లోరినేషన్ గ్యాస్ లీకేజీతో దెబ్బతిన్న పంటలు
- 40 ఎకరాల మేర నష్టం
- ఆందోళనలో రైతులు



గ్యాస్ లీకేజీతో మేదినీపూర్ శివారులో దెబ్బతిన్న పత్తి చేను

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల పరిధిలోని మంగోల్ గ్రామ శివారులోని మిషన్ భగీరథ గ్రిడ్ 540 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లోని క్లోరినేషన్ విభాగం నుంచి ఒకటో తేదీన గ్యాస్ లీకేజీ వల్ల పంటలు దెబ్బతిన్న రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

ఆత్మహత్యలే శరణ్యం

ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందించక పోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట, గజ్వేల్, జనగామ, ఆలేరు, బోనగిరి, మేడ్చెల్ పట్టణాల్లోని 1,922 గ్రామాలకు ప్రతిరోజూ మిషన్ భగీరథ పథకంలో తాగునీరు సరఫరా జరుగుతోంది. రోజూలాగానే 1వ తేదీన కూడా అధికారులు మల్లన్న సాగర్ నుంచి వస్తున్న నీటిని క్లోరినేషన్‌తో శుద్ధి చేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ లీకైంది. దీంతో ప్లాంట్‌లో పనిచేస్తున్న సిబ్బంది, ప్లాంట్ చుట్టు పక్కల వ్యవసాయ భూముల్లో పనులు చేస్తున్న రైతులు భయంతో పరుగులు తీశారు. సుమారు పది నిమిషాల వ్యవధిలో లీకైన గ్యాస్ గాలిలో సుమారు అర కిలోమీటరు దూరం వరకు వ్యాప్తించింది.

అందని పరిహారం

విషయం తెలుసుకున్న కలెక్టరు హైమావతి ఆ పంటలను పరిశీలించారు. తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని అన్నదాతలు ఆమె వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. గ్యాస్ లీకేజీ సమయంలో వ్యవసాయ పనులు చేస్తున్న రైతులకు కళ్ల సమస్యలు, శరీరమంతా ఎలర్జీలు వచ్చాయని వాపోయారు. గ్యాస్ లీకేజీతో దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించాలని బాధితులు వేడుకుంటున్నారు.



భద్రత లేకుండా బయటే ఉంచిన సిలిండర్లు

40 ఎకరాల్లో పంట నష్టం

గ్యాస్ లీకేజీతో ప్లాంట్ చుట్టుప్రక్కల ఉన్న మంగోల్, మేదినీపూర్ గ్రామ శివారుల్లోని సుమారు 40 ఎకరాల మేర వరి, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అనేక ఇబ్బందులను ఎదుర్కొని పంటలను కాపాడుకుంటూ వస్తున్న క్రమంలో తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు.



దెబ్బతిన్న వరి పంట

నష్టపరిహారం అందించాలి



గ్యాస్ లీకేజీ వల్ల మూడెకరాల పత్తి, ఎకరం వరి పంట పూర్తిగా దెబ్బతిన్నది. ఆ సమయంలో ప్లాంట్‌కు 15 గజాల దూరంలో పత్తిచేనులో కలుపు తీస్తున్నాను. ఒక్కసారిగా విష వాయువు వ్యాపించడంతో కళ్లు చెమ్మగిల్లాయి. శరీరమంతా దురద, మంట పుట్టింది. దీంతో భయంతో పరుగు పెట్టాను. నష్ట పోయిన పంటలకు గాను నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

- తాడెం లత, రైతు, మేదినీపూర్

నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే లీకేజీ



మిషన్ భగీరథ నీటిని శుద్ధి చేసేందుకు వినియోగించే క్లోరినేషన్ గ్యాస్ సిలిండర్లను ఆరుబయటే వదిలేశారు. ఎలాంటి భద్రత కాని, ప్రమాద నివారణ చర్యలు కాని తీసుకోలేదు. దీంతో గ్యాస్ లీకేజీతో వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. చుట్టుపక్కల చెట్ల ఆకులు ఎర్రబారాయి. గ్యాస్ లీకేజీ ప్రదేశంలో తిరుగుతుంటే కళ్లు మండుతున్నాయి. ప్లాంట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి.

- తాడెం కరుణాకర్, మేదినీపూర్

పరిహారం అందేలా చూస్తాం



క్లోరినేషన్ గ్యాస్ లీకేజీతో వరి, పత్తి పంటలు దెబ్బతిన్న విషయం వాస్తవమే. గ్యాస్ లీకేజీ వల్ల దెబ్బతిన్న పంటల నష్టం అంచనా వేసే పనుల్లో మండల స్థాయి అధికారులు నిమగ్నమయ్యారు. నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం అందించేందుకు నివేదికలు రూపొందిస్తున్నారు. బాధిత రైతులందరికీ నష్ట పరిహారం అందేలా చూస్తాం.

- స్వరూపరాణి, జిల్లా వ్యవసాయాధికారి

క్యూ కాంప్లెక్స్ పనులు పూర్తిచేయండి

ఆలయ ఈఓ వెంకటేశ్



క్యూ కాంప్లెక్స్ పనులు పరిశీలిస్తున్న వెంకటేశ్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో చేపట్టిన క్యూ కాంప్లెక్స్ నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని ఆలయ ఈఓ వెంకటేశ్ కాంట్రాక్టర్ అప్పారావును ఆదేశించారు. ఆలయ డీఈ మైహిపాల్‌రెడ్డితో కలసి ఆదివారం ఆయన పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యూ కాంప్లెక్స్ పనులు ప్రారంభించి రెండు సంవత్సరాలైనా కాంట్రాక్టర్ పూర్తిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబరు నాటికి పనులు పూర్తిస్థాయిలో పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించినట్టు చెప్పారు. పనులలో జాప్యం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతిరోజు పనులు పర్యవేక్షించాలని ఆలయ డీఈకి సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతే ధర నిర్ణయించుకునే అవకాశం ఉండాలి

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర నేత వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): పండించిన పంటలకు రైతే గిట్టుధర నిర్ణయించుకునే రోజుల కోసం భారతీయ కిసాన్ సంఘ్ పోరాటం చేస్తుందని కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకట్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దుద్దెడ రైతువేదికలో ఆదివారం మండల స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో నాయకత్వ లక్షణాలు పెంపొందేలా చూస్తున్నామన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు ధర నిర్ణయించుకునే అవకాశాలపై ప్రభుత్వాలు దృష్టి పెట్టకపోవడం బాధాకరమన్నారు. రైతు సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పోరాటం చేయడమే తమ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, సంపత్‌రావు, మహేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, జశ్వంత్‌రెడ్డి, నిర్మల, శ్రీనివాసరావు, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

వనంచెరువు బుంగ పూడ్చివేత



వెంకట్రావుపేట వనంచెరువు గండిని పూడ్చి వేస్తున్న జేసీబీ, రైతులు

తొగుట(దుబ్బాక): మండలంలోని వెంకట్రావుపేట వనంచెరువుకు పడిన గండిని అధికారులు పూడ్చించారు. తూము పక్క నుంచి నీరు లీకవ్వడంతో ఆదివారం ఉదయం కొందరు రైతులు గుర్తించారు. రైతుల ద్వారా విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి అక్కడికి వెళ్లి పరిశీలించారు. వెంటనే తహసీల్దార్ శ్రీకాంత్, నీటిపారుదలశాఖ డీఈఈ చెన్ను శ్రీనివాస్‌రావు, ఏఈ అస్మాలకు పరిస్థితిని వివరించారు. దీంతో వారు అప్రమత్తమై నీటిపారుదలశాఖ లస్కర్లను పంపించారు. వారితో కలిసి రైతులు గడ్డికట్టలను వేసి ఆపేందుకు ప్రయత్నించారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో జేసీబీ సహాయంతో గండిని పూడ్చివేశారు. సకాలంలో స్పందించి చెరువు నుంచి నీరు బయటకు వెళ్లకుండా చర్యలు తీసుకున్న అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడి

మాల మహానాడు రాష్ట్ర నేత శ్రీరాములు



మాట్లాడుతున్న చైర్మన్ శ్రీరాములు

దుబ్బాక: మాలమహానాడు ఆధ్వర్యంలో జీఓ 99ని రద్దుచేయాలని కోరుతూ రాష్ట్రంలోని అన్ని ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను సోమవారం ముట్టడిస్తున్నట్లు రాష్ట్ర పోలిట్‌బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనసమీకరణ ఎక్కువ ఉంటే క్యాంపు ఆఫీసు గేట్ ఎదుట బైఠాయించి నినాదాలు ఇచ్చి ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇవ్వాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. జీఓ 99 ప్రతులను క్యాంపు కార్యాలయాల ఎదుట దహనం చేయా లని చెప్పారు. ఎమ్మెల్యేలు లేకపోతే వినతిపత్రాలను గేట్‌కు తగిలించాలన్నారు. న్యాయబద్ధంగా చేపడుతున్న ఈ ఉద్యమంలో మాలలు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు రామస్వామి, దాస్, స్వామి, రవీందర్, జీవన్, స్కైలాబ్, ప్రభాకర్, బాబు తదితరులు ఉన్నారు.

భారీ గుంత.. జారీ పడితే అంతే..



రామసాగరం-వీరాపూర్ అంతర్గత రోడ్డుపై భారీ గుంత

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని రామసాగరం-వీరాపూర్ అంతర్గత రోడ్డులోని కల్వర్టుపై ఏర్పడిన భారీ గుంత అటువెళ్లే వారిని భయపెడుతోంది. పొరపాటున జారిపడితే పాతాళానికి పోవాల్సిందేనని రైతులు, వాహనదారులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లాలంటే ఈ రోడ్డే దిక్కు. ధ్వంసమైన ఈ రోడ్డుపై ఎరువులు, కూలీలను తీసుకెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. అసౌకర్యంగా మారిన ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని, భారీ గుంతను వెంటనే పూడ్చాలని కోరుతున్నారు.

- బెజ్జంకి(సిద్దిపేట)

సేవను మించిన మానవీయ గుణం లేదు

విజయదుర్గ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు హరినాథ శర్మ



ట్రస్టు సభ్యులకు చీరలు పంపిణీ చేస్తున్న హరినాథ శర్మ

కొండపాక(గజ్వేల్): సేవను మించిన మానవీయ గుణం మరొకటి లేదని విజయదుర్గా మాత చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు చెప్పెల హరినాథశర్మ అన్నారు. మర్పడ్గలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం జరిగిన ట్రస్టు సమావేశంలో ఆయన మాట్లాడారు. నిస్వార్థ సేవ ఉన్నప్పుడే దైవభక్తి కొలువుంటుందన్నారు. సత్యం, ధర్మం శాశ్వతమైనవని సూచించారు. అసత్యం, అధర్మం, ఆడంబరం తాత్కాలికంగా గొప్పగా కనిపించినా అంతిమ విజయం ధర్మానిదేనని బోధించారు. అనంతరం ట్రస్టు సభ్యులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు కొమ్మెర సుదర్శన్‌రెడ్డి, మోహన్‌దాస్, చీకోటి మల్లికార్జున్, రాజేంద్ర ప్రసాద్, మల్లేశం, లగిశెట్టి రాజు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునగౌడ్‌కు ఉత్తమ అవార్డు



మల్లికార్జున గౌడ్

టేక్మాల్(మెదక్): హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆదివారం లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో మండలంలోని కుసంగికి చెందిన మల్లికార్జునగౌడ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నాడు. ఈ మేరకు లయన్స్ క్లబ్ చైర్మన్ బాబురావ్, లయన్స్ క్లబ్ డైరెక్ట్ గవర్నర్ అమృత్‌రావ్, ఐఏఎస్ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆయనకు తోటి ఉపాధ్యాయులతో పాటు కుసంగి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నేడు రాజకీయ నాయకులతో సమావేశం

నారాయణఖేడ్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సోమవారం నిజాంపేట్ మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఉదయం 11.30కు సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సంగ్రాం తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు నాయకులు హాజరై సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు.

పీఎంశ్రీని అంగన్‌వాడీల్లోనే నిర్వహించాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కారాములు

సిద్దిపేటఅర్బన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రీ ప్రైమరీ పీఎంశ్రీ విద్య కేంద్రాలను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని, విద్యా బోధన బాధ్యతను అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు డిమాండ్ చేశారు. సిద్దిపేటలోని కార్మిక, కర్షక భవన్‌లో ఆదివారం నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశానికి చుక్కా రాములు హాజరై మాట్లాడారు. విద్యా వలంటీర్లను నియమించి వారికిచ్చే వేతనాన్నే ప్రస్తుతం కొనసాగుతున్న అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరేళ్ల లోపు పిల్లలకు ప్రైవేట్ స్కూల్స్‌లో చేర్చుకోవడానికి అనుమతి ఇవ్వవద్దని, అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చే అదనపు పనులు రద్దుచేసి, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పీఎంశ్రీ విద్య పోటీ స్కూల్స్ కోసం ఈ నెల 1 నుంచి 9 వరకు నిర్వహిస్తున్న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రీ ప్రైమరీ పీఎంశ్రీ విద్యను కొత్త సెంటర్లలో నడపడానికి దరఖాస్తులు తీసుకోవడం ఆపని పక్షంలో ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పద్మ, ఉపాధ్యక్షులు వీరమణి, కళావతి, జిల్లా కమిటీ సభ్యులు బాలవ్వ, యశోద, గీత తదితరులు పాల్గొన్నారు.

21న మల్లుపల్లిలో బహుజన బతుకమ్మ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని మల్లుపల్లిలో 21న బహుజన బతుకమ్మ పండుగ నిర్వహించనున్నట్లు బహుజన బతుకమ్మ కమిటీ నిర్వహణ సభ్యుడు యాదగిరి తెలిపారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఆదివారం బహుజన బతుకమ్మ పండుగకు చెందిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 3 వరకు రాష్ట్ర వ్యాప్తంగా బహుజన బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. మల్లుపల్లిలో నిర్వహించే వేడుకల్లో బహుజన బతుకమ్మ వ్యవస్థాపకురాలు విమలక్క పాల్గొంటారని చెప్పారు. ప్రతి ఒక్కరు వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు ఎల్లం, నర్సింహులు, మహేందర్, మల్లేశం, పరశురాములు, వెంకట్, నర్సింహులు, నందు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

హుస్నాబాద్: ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదివిన 1999–2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వారికి చదువు నేర్పిన గురువులకు శాలువాలు వేసి ఘనంగా సన్మానించారు. 25 సంవత్సరాల తర్వాత కలుసుకొన్న వారంతా ఆ నాటి జ్ఞాపకాలను పంచుకొని సందడి చేశారు.

గిరిజనులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

చేగుంట(తూప్రాన్): మాసాయిపేట మండలంలోని వెనుకతండా, నడిమితండాల్లో మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తండాల్లో అనారోగ్యానికి గురైన బాధితులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాల సీజన్‌తో జ్వరాలు వస్తున్నాయని, దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరం తీవ్రంగా ఉన్నవారికి రక్తపరీక్షలు నిర్వహించి ల్యాబ్‌కు పంపించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్ టెక్నీషియన్ రాంచంద్రం, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం



రిటైర్డ్ ఉద్యోగుల నూతన కార్యవర్గ సభ్యులతో జిల్లా నాయకులు

కొల్చారం(నర్సాపూర్): రిటైర్డ్ ఉద్యోగుల హక్కులను కాపాడడంతో పాటు ప్రభుత్వం అందించే సౌకర్యాలను కల్పించాలని జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జగదీష్ చంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మండల వనరుల కేంద్రంలో సమావేశమై మండల రిటైర్డ్ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సంజీవరావు, ప్రధాన కార్యదర్శిగా మల్లారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా సామ్యూల్, అసోసియేషన్ అధ్యక్షుడిగా దశరథ్, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ సాజిత్ అలీ, యూసుఫ్, కార్యదర్శిగా సుధాకర్, మహిళా ఆర్గనైజేషన్ సెక్రటరీగా నాగమ్మ, ప్రచార కార్యదర్శిగా షాబుద్దీన్ ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన వారిని ఎన్నికల పరిశీలకులు సత్యనారాయణతో కలిసి నియామక పత్రాలు అందజేశారు. శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.